క్లుప్తంగా

వైభవంగా జగన్నాథ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



జగన్నాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న గారపాటి చౌదరి దంపతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ జగన్నాథ మందిరంలో సోమవారం జగన్నాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మహా కుంభాభిషేకాలు, పుష్పాభిషేకాలు చేశారు. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతా రామాంజనేయ చౌదరి, రేణుక దంపతులు పాల్గొన్నారు. కాగా మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి జగన్నాథ రథయాత్ర నగరంలోని అశోక్ నగర్‌లో ప్రారంభమై వివిధ ప్రాంతాల మీదుగా రామకోటి వరకు కొనసాగుతుందని మందిరం ప్రతినిధులు తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రతిష్ఠా మహోత్సవ పూజల్లో మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, గొల్లపూడి శ్రీ జగన్నాథమందిరం అధ్యక్షుడు దయానిధి దాస్ ప్రభుజీ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన పెంచాలి



వెంకటాపురంలో సంచార జాతుల మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

ఏలూరు రూరల్: కుష్టువ్యాధి నివారణపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని ఫ్యామిలీ ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ నిర్మలాగ్లోరీ అన్నారు. సోమవారం జాతీయ కుష్టు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యాధికారులు సంచార జాతుల ఆరోగ్య స్థితిని పరిశీలించారు. వెంకటాపురం-1 పరిధిలో నివసిస్తోన్న సంచార జాతుల ప్రజలను నిర్మలాగ్లోరీ, ఆరోగ్య జిల్లా లెప్రసీ అదనపు వైద్యాధికారి జి.రత్నకుమారి, జిల్లా లెప్రసీ ఆరోగ్య విస్తరణాధికారి కె.సత్యానందం కలిశారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లల శరీరం పరిశీలించి కుష్టు మచ్చలు ఉన్నాయో లేదో పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది సర్వే వస్తున్నారా అంటూ ప్రశ్నించారు. కుష్టు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తొలుత అధికారులు చాటపర్రులో పీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

నేటి నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

- పండుగలా సర్టిఫికెట్ల మంజూరుకు రెడీ
- శ్రమిస్తున్న ప్రభుత్వ అధికారయంత్రాంగం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని చేతులమీదుగా పంపిణీ



ఏలూరు నగరంలోని సచివాలయం (ఫైల్)

ఏలూరు టౌన్: ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించనున్నారు. ఏలూరు నగరంలోని పలు డివిజన్లలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, గృహసారధులు ఏడు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఇక ప్రజా సమస్యలు పరిష్కరంలో భాగంగా సర్టిఫికెట్ల పంపిణీకి అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. ప్రజలకు అడిగిన వెంటనే 11 రకాల సర్టిఫికెట్లు అందజేసేలా సురక్ష కార్యక్రమాన్ని రూపుదిద్దారు.

ఏలూరులో జగనన్న సురక్ష ఇలా..

నగరంలోని 80 సచివాలయాల్లో ఐదు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా విభజించారు. 16 రోజుల పాటు జూలై 4 నుంచి ఆయా క్లస్టర్లలో క్యాంపును ఏర్పాటు చేస్తారు. తొలుత ఆరు రోజుల పాటు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల అవసరాలు గుర్తిస్తారు. వారితో యాప్‌లో దరఖాస్తు చేయించి ఏడో రోజు క్యాంపులో వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం, పంటసాగు హక్కు కార్డు, కొత్త లేదా స్ప్లిట్ రైస్ కార్డు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన తదితర ప్రజలకు అత్యవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తారు.

షెడ్యూల్ ఇలా..

- 4న ఏలూరు కబాడీగూడెం (ఎమ్మార్సీ కాలనీ 1, 2, యాదవనగర్ 1, 2, తాసీమేస్త్రీ కాలనీ సచివాలయాలు)
- 5న వన్‌టౌన్ తోటకూర దొడ్డు (తోటకూరదొడ్డు 1, 2, 3, గజ్జలవారి చెరువు, నాగేంద్రకాలనీ 3 సచివాలయాలు)
- 6న సుఖీభవ కల్యాణ మండపం (తాసీమేస్త్రీకాలనీ 1,2, చొదిమెళ్ల, తంగెళ్లమూడి 1, 2 సచివాలయాలు)
- 7న ఐకేపీ భవన, సత్యనారాయణపేట (లంబాడీపేట, భావిశెట్టివారిపేట, కొమడవోలు, రామ్ నగర్-2 సచివాలయాలు)
- 10న లంకపేట (లంకపేట 1, 2, శివగోపాలపురం, మోతేవారితోట 3, పాములదిబ్బ సచివాలయాలు)
- 11న వీవర్స్‌కాలనీ, స్కూల్ గ్రౌండ్ (వెంకన్న చెరువు, ఐకేపీ భవన్ 2, ఫిలాస్‌పేట 1, 2, సుంకరవారితోట 1 సచివాలయాలు)
- 12న టైలర్స్ అసోషియేషన్ హాల్, పత్తేబాద (పత్తేబాద, మోతేవారి తోట 1, 2, ఎరుకుల కాలనీ, అశోక్‌నగర్ సచివాలయాలు)
- 13న గాంధీకాలనీ స్కూల్ (గొల్లాయగూడెం 1, 2, గాంధీకాలనీ, అరుంధతీపేట, వెస్ట్రన్‌స్ట్రీట్ సచివాలయాలు)
- 14న తూర్పుకాపు కళ్యాణమండపం (ఐకేపీ భవన్ 1, చోడిదిబ్బ, వంపులసెంటర్, చేపలతూము 1, ఆర్‌ఆర్‌పేట సచివాలయాలు)
- 15న గాంధీ జ్ఞానమందిరం (ఏఏఎస్‌కాలనీ, పడమరవీధి, కోటదిబ్బ, కెనాల్ రోడ్డు సచివాయాలు)
- 17న ఉర్దూషాదీఖానా పెన్షన్‌లైన్ (శేఖర్‌స్ట్రీట్, రజకులపేట, గన్‌బజార్ 1, 2, కొత్తపేట సచివాలయాలు)
- 18న జేపీ కాలనీ వాటర్‌ట్యాంక్ (సదరన్‌స్ట్రీట్, అశోకచక్రం రోడ్డు, జ్వాలాపహరేశ్వర కాలనీ, పోణంగి, వైఎస్సార్ కాలనీ 4 సచివాయాలు)
- 19న మెడికల్ అసోసియేషన్ హాల్ (పవర్‌పేట, చేపలతూము 2, ఆర్‌ఆర్‌పేట, రాజీవ్‌గాంధీపార్క్ సచివాయాలు)
- 20న పోస్టల్ కాలనీ పార్క్ (ఎన్‌ఆర్‌పేట, పోస్టల్ కాలనీ, హనుమాన్‌నగర్ 5, సాయినగర్ 6 సచివాయాలు)
- 21న సారధి కల్యాణ మండపం (శాంతినగర్ 1, శనివారపుపేట 1, 2, 3, 4 సచివాయాలు)
- 22న రాజరాజేశ్వరి కల్యాణ మండపం (అశోక్ పిల్లర్ రోడ్, ఫిరంగులదిబ్బ, శాంతినగర్ 2, సత్రంపాడు 1, సత్రంపాడు 2 సచివాయాలు)

ప్రజలకు మెరుగైన సేవలు



నగరంలోని ప్రజలకు మరింత మెరుగైన రీతిలో సేవలు అందించాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో ఇప్పటికే ఇంటింటా సర్వే చేపట్టాం. మూడు టీమ్‌లుగా ఏర్పడి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజల అవసరాలు గుర్తిస్తున్నాం. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రజలకు సేవలు విస్తరించటం శుభపరిణామం.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

● పింఛన్ పంపిణీ



నగరంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం ఏలూరులో డి.ఉషారాణికి వితంతు పింఛన్‌ను వలంటీర్ సీహెచ్ మాధవి అందజేశారు.

– సాక్షిఫొటోగ్రాఫర్/ ఏలూరు

సొసైటీలను కాపాడాలి

ఏలూరు రూరల్: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలను (పీఏసీఎస్) కాపాడాలని ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.అజయ్‌కుమార్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సొసైటీ ఉద్యోగులు ధర్నా చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే పీఏసీఎస్ సిబ్బందికి పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని సంఘం నాయకులు కోరారు. అనంతరం ఆర్.లింగరాజు, టి.గంగరాజు, పి.సుబ్బారావు, జి.వీరయ్య తదితరులు జిల్లా కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు



పాండురంగ స్వామి దేవస్థానంలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు



పవర్‌పేట బడేటి వారి వీధిలోని సాయిబాబా



భక్తులకు ప్రసాదం వడ్డిస్తున్న తపన చౌదరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం నగరంలోని పలు సాయిబాబా మందిరాల్లో విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబాకు అభిషేకాలు, విశేష హారతులు, సాయి సత్య వ్రతాలు ఆచరించి, బాబా ఊరేగింపులు నిర్వహించారు. పాత బస్టాండు సెంటర్ పాండురంగ స్వామి ఆలయంలో షిర్డీ సాయి మందిరంలో ఉదయం కాకడ హారతి, గురుపాదుకా స్వరూపుడైన దత్తాత్రేయునికి పాదుకాపూజ, విశేష పుష్పార్చన నిర్వహించారు. సాయినాథుని సత్య వ్రతాలు సామూహికంగా ఆచరించారు, సాయి గురుదత్త హోమం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ చేశారు. అన్న సమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం బాబావారికి చావడి ఉత్సవం, జ్యోతిర్లింగార్చన చేసి దర్బారు సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దేవదాయ శాఖ ఏలూరు జిల్లా అధికారి సీహెచ్ రంగారావు బాబాను దర్శించుకున్నారు. ఆలయ మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బాలాత్రిపుర సుందరి దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు దండిభొట్ల కనకసుందర శర్మ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. పవర్‌పేట బడేటి వారి వీధి కోదండ రామాలయంలో షిర్డీ సాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు రజత అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు నారాయణం కోదండ రామాచార్యులు, లక్ష్మణ రంగ సాయి ఫణి కుమార్ విశేష పూజలు చేశారు.

రెండో డివిజన్‌లో..

ఏలూరు రూరల్: గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ఏలూరు 2వ డివిజన్ శ్రీరామనగర్, ఏసుపాదపురంలో శ్రీసాయినాథ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రేణుక దంపతులు, జనసేన నాయకుడు రెడ్డి అప్పలనాయుడు, శిరిపల్లి ప్రసాద్ తదితరులు హాజరై బాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భారీ అన్న సమారాధన చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు



ప్రత్తికోళ్లలంకలో ప్రజలకు ధ్రువపత్రాలు అందిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

ఏలూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భారతి అన్నారు. సోమవారం ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంకలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పొందాల్సిన ధ్రువపత్రాలు గ్రామస్థాయిలో అందించడం ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. డీఆర్వో, ప్రత్యేక అధికారి ఏవీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవ చేయడమే జగనన్న సురక్ష లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా 487 మందికి పలు రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సరళకుమారి, తదితరులు పాల్గొన్నారు.

● హౌసింగ్ కార్పొరేషన్ డే



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ స్థాపించి జూలై 5కు 44 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. షటిల్, క్రికెట్, రన్నింగ్, సింగింగ్, రంగోళి, బ్లడ్ డొనేషన్ నిర్వహిస్తున్నామని అందులో భాగంగా సోమవారం ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు జూలై 5న బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఎస్‌పీఆర్‌వీ కుమార్, ఎండీ షరీఫ్, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షిఫొటోగ్రాఫర్/ ఏలూరు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	80	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07-10
బెండకాయలు	30	కంద	46
పచ్చిమిర్చి	80-100	బీట్‌రూట్	38
కాకర కాయలు	56	కీరా దోస	60
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	130-240
క్యాబేజీ	26	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	22	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	86
పొట్లకాయ(1)	15	చిలకదదుంప	44

పుస్తకాలపై ప్రత్యేక శ్రద్ధ



పాఠ్యపుస్తకాలు చూపుతున్న విద్యార్థులు



బైండింగ్ చేయించిన పుస్తకాలతో విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎంతో నాణ్యతగల జగనన్న విద్యాకానుక పాఠ్యపుస్తకాలను చూసి విద్యార్థులు ముచ్చట పడుతున్నారు. ఈ విద్యాకానుక తమకెంతో అపురూపమని, దానిని అదే స్థాయిలో భద్రపరుచుకుంటామని వారు చెబుతున్నారు. పాఠ్యపుస్తకాలు నలగకుండా సంవత్సరమంతా కాపాడుకొనేందుకు బైండింగ్ (గట్టి అట్టలు) వేయించుకున్నారు. ఏలూరు శ్రీరామ్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగేంద్ర సింగ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యపై శ్రద్ధ పెరిగిందని, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ప్రోత్సాహకాలకు విద్యార్థులు ఆకర్షితులవుతున్నారని వివరించారు.

టైం స్కేల్ అమలు చేయాలి

ఏలూరు రూరల్: నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని ఎన్‌హెచ్‌ఎం జేఏసీ చైర్మన్ డి.దయామని కోరారు. సోమవారం ఎన్‌హెచ్‌ఎం జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగులు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. స్టాఫ్‌నర్సులు స్వర్ణ, కుసుమ, దీవెన, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు





స్థిరాస్తి నాటికలో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన సన్నివేశం, రామాంజనేయ యుద్ధం నాటిక ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం, హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న అల్లూరి సీతారామరాజు స్మారక ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా మూడో రోజు సోమవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. సాయంత్రం 6.30 గంటలకు వీరన్నపాలెంకు చెందిన కళానికేతన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన స్థిరాస్తి నాటిక ఆద్యంతం రక్తికట్టిస్తూ వీక్షకులను ఆకట్టుకుంది. అనంతరం నగరానికి చెందిన కళాకారులు వి.రామాంజనేయులు రామునిగా, మండవ రాజగోపాలకృష్ణ ఆంజనేయునిగా ప్రత్యేకంగా ప్రదర్శించిన శ్రీ రామాంజనేయ యుద్ధం (యుద్ధ సన్నివేశం) లోని పౌరాణిక పద్యాలు కళాభిమానులను పరవశింపచేశాయి. ఈ నాటికకు వీ.సురేష్ రాజు సంగీతం అందించారు. కార్యక్రమంలో హిందూ యువజన సంఘం మేనేజ్ మెంట్ కమిటీ ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, కార్యనిర్వాహ కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ లునాని, సహాయ కార్యదర్శులు కేబీరావు, ఎల్.వేంకటేశ్వరరావు, హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, గుత్తా కౌసలేంద్రర రావు, సంకు సురేష్, ఎండీ ఖాజావలి, సభ్యులు ఎం.సూర్యనారాయణ యాదవ్, జిల్లెళ్లముడి వర ప్రసాద్, అధిక సంఖ్యలో కళాభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

డీపీఓని కలిసిన కార్యదర్శులు

పెదపాడు: ఏలూరు జిల్లా పంచాయతీ కార్యదర్శిగా నియమితులైన పూర్ణ చంద్రరావును పెదపాడు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సవరణ

శ్రీ బాలబాలాజీ దేవస్థానం, అప్పనపల్లి, డా॥ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ది. 27-6-23 సాక్షి దినపత్రికలో ప్రచురించబడిన ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ కమ్ బహిరంగ వేలం తేదిని. 03-07-2023కి బదులుగా ది. 06-07-2023గా మార్చబడినది. కావున తెలియజేయడమైనది.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	22
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	31
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

ఎస్సీ వర్గీకరణ విషయంలో మోసం

పెదవేగి : ఎస్సీ వర్గీకరణ విషయంలో అన్ని పార్టీలు తమను మోసం చేసి రాజ్యాంగ బద్ధ హక్కును కాలరాస్తున్నారని ఏలూరు జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు గొట్టేటి స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. పెదవేగి మండలం నడిపల్లిలో గొట్టేటి స్టాలిన్ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం మాదిగల జన జాగృతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కో కన్వీనర్ పలివెల చంటి మాదిగ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

బీమా పరిహారం దరఖాస్తుల గడువు పెంచాలి

ఏలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పంటల బీమా పరిహారంపై రైతుల అభ్యంతరాల దరఖాస్తుల గడువు పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ, కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. 2022లో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఖరీఫ్‌లో వరి, ఇతర పంటలకు తీవ్ర నష్టం జరిగి రైతులు నష్టపోయారని గుర్తు చేశారు. కానీ, కలిదిండి మండలంలో 154 మంది రైతులకు మాత్రమే వరి పంటకు బీమా వర్తింపజేసి చేతులు దులపుకున్నారని ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో పత్తి రైతులకు మాత్రమే బీమా వర్తింపజేశారని వెల్లడించారు. ప్రభుత్వం స్పందించి నిబంధనలు సడలించి నష్టపోయిన రైతులు అందరికీ బీమా వర్తింప చేయాలని కోరారు.